కాంగ్రెస్‌ది సంవత్సరీకం

విజయోత్సవం కాదు..

గాంధీ రాజీనామా చెయ్.. : ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కార్యకర్తలకు అండగా ఉంటా..: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు. చిత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మియాపూర్, నవంబర్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా విధ్వంసమే తప్పితే అభివృద్ధి శూన్యమని ఏ వర్గం వారు సంతృప్తికరంగా లేరని బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పని చేయకుండా ఏడాది పాలనపై జరుకుంటున్నది విజయోత్సవం కాదని.. అది సంవత్సరీకమని దుయ్యబట్టారు. నియోజకవర్గ పార్టీ శ్రేణుల కఠోర శ్రమతో ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీ పార్టీ మారి తీవ్రమైన మోసం చేశారని, తక్షణమే ఆయన రాజీనామా చేయాలని శంభీపూర్‌రాజు డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని గోదా ఫంక్షన్ హాల్‌లో పార్టీ సీనియర్ నేత ఎర్ర బెల్లి సతీశ్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. కూకట్‌పల్లి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, జూపల్లి సత్యనారాయణ, జగన్, మంత్రి సత్యనారాయణ సహా పార్టీ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరం సహా రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని, కేవలం బీఆర్ఎస్, పార్టీ శ్రేణులను తిట్టడమే పనిగా పెట్టుకున్నదన్నారు. ప్రజలకు అండగా బీఆర్ఎస్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని, సీఎం రేవంత్‌రెడ్డి ఏ పథకాన్ని అమలు చేయడంలేదని శంభీపూర్ రాజు విమర్శించారు. నియోజకవర్గ పార్టీ శ్రేణుల కష్టంతో ఎమ్మెల్యేగా గెలిచిన గాంధీ తన స్వార్థం కోసం పార్టీ మారాడని, తక్షణమే ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... తన రాజకీయ ప్రస్థానం ఈ నియోజకవర్గం నుంచే మొదలైందని, ప్రజల ఆదరాభిమానాలతోనే ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. నియోజకవర్గ పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అండగా నిలుస్తానని, ఏ కష్టం వచ్చినా తీర్చేందుకు తానే ముందుంటానని ఆయన స్పష్టం చేశారు. శేరిలింగంపల్లిలో నాయకులే కాంగ్రెస్‌లో చేరారే తప్ప బీఆర్ఎస్ శ్రేణులు ఎవరూ పార్టీ మారలేదని, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను కార్యకర్తల మద్దతుతో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో అంతటా విధ్వంసమే తప్ప అభివృద్ధి లేదని, ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, సంతోష్‌రావు, రాములు గౌడ్, సమద్, ఖాజా, జగదీష్, సాయిగౌడ్, మనీష్ గౌడ్, మహేశ్, నాగేశ్వర్‌రావు, మాచర్ల భద్రయ్య, గోపరాజు శ్రీనివాస్, కిరణ్ యాదవ్, రోజా, శ్రీను, శంకర్, లక్ష్మణ్, శ్రీనివాస్, రామస్వామి, పాండు, నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించండి

సమీక్షలో అధికారులకు మేయర్ ఆదేశం

సిటీబ్యూరో, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): 'ప్రజావాణి'లో వస్తున్న ఫిర్యాదులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులకు సూచించారు. మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, హెచ్ఓడీలతో 'ప్రజావాణి', మై జీహెచ్ఎంసీ యాప్, ట్విట్టర్, ఆన్‌లైన్ ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, జోనల్, సర్కిల్ స్థాయిలో 'ప్రజావాణి'లో ఎక్కువగా టౌన్‌ప్లానింగ్‌పైన ఫిర్యాదులు వస్తున్నాయని, అందుకు గల కారణాలు సంబంధిత అధికారులను మేయర్ అడిగి తెలుసుకున్నారు.

సమావేశంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, స్నేహ శబరీష్, సుభద్ర దేవి, సత్యనారాయణ, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, పంకజ, సరోజ, రఘుప్రసాద్, అశోక్ సామ్రాట్, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, రవికిరణ్, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ప్రభుత్వ ఉపాధి డొల్లే..

ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కర్మన్‌ఘాట్‌లో హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట, నవంబర్ 19: నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉపాధి డొల్లేనని, స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవడమే ఉత్తమమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్ చౌరస్తా సమీపంలో నిర్వాహకులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న 'చిరాగ్ హోటల్'ను మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి చూపే పరిస్థితి లేకపోవడంతో వారు వ్యాపారాలతో కుటుంబాలను పోషించుకునేందుకు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవడం ఎంతో మంచి పరిణామమన్నారు. అలాగే హోటల్స్ వ్యాపారం చాలా సున్నితమైనదని, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందిస్తే ఆ వ్యాపారం లాభసాటిగా కొనసాగుతుందన్నారు. అంతే కాకుండా ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియన్ నేతలు గోలీ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, బేర బాలకిషన్, హోటల్ నిర్వాహకులు సందీప్ యాదవ్, అనిల్ గౌడ్, సందీప్, అరుణ్‌రెడ్డి, దయానంద్, ఆనంద్‌గౌడ్, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతలను బట్టి ఆర్టిజన్స్ కన్వర్షన్ చేయాలి

అభివాదం చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్- జేఏసీ చైర్మన్ కె.ఈశ్వర్‌రావు తదితరులు

చిక్కడపల్లి, నవంబర్19: ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేస్తే సంస్థకు ఆర్థిక భారం పడదని, ఆర్టిజన్స్ కార్మికులందరిని విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్- జేఏసీ చైర్మన్ కె.ఈశ్వర్‌రావు అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్-జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో సుమారు 20వేల మంది ఆర్టిజన్స్‌గా పని చేస్తున్నారని, అంతకు ముందు ఈ కార్మికులందరూ కాంట్రాక్ట్ కార్మికులని తెలిపారు. 2017లో వీరి సంఖ్య 23,667 మంది అని వివరించారు. వీరిలో కొంత మంది రిటైర్డ్ అయ్యారని, మరి కొంత మంది విద్యుత్ ప్రమాదాలతో మరణించారని తెలిపారు. రిటైర్డ్ అయిన ఆర్టిజన్స్ కార్మికులకు కేవలం రూ.40వేల నుంచి రూ.80వేలు మాత్రమే రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రావడం చాలా అన్యాయం అన్నారు. జేఏసీ కన్వీనర్ ఎం.ఎ.వజీర్, నాయకులు శంకర్, నరేంద్, ఎల్లయ్య, నాగరాజు, అరవిందకుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

డీ సిల్టింగ్ పనులతో తగ్గిన ఫిర్యాదులు

- 1000 కి.మీ పైపులైన్‌కు సీవరేజీ పూడికతీత
- 80 వేల మ్యాన్‌హోళ్లు శుభ్రం
- పనితీరులో ప్రతిభ కనబర్చిన టాప్-10 అధికారులకు సత్కారం
- 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌పై జలమండలి ఎండీ, ఈడీ సమీక్ష

ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సిటీబ్యూరో, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రోజూ వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడం కంటే, అసలు ఆ ఫిర్యాదుల శాతాన్ని తగ్గించడమే అసలైన విజయమని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్‌యే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌పై ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటి దాకా 8వేల ప్రాంతాల్లో 1000 కిలోమీటర్ల మేర సీవరేజీ పైపులైన్‌కు డీ-సిల్టింగ్ పనులు నిర్వహించినట్లు ఎండీ వివరించారు. అటు 80వేల మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసినట్లు పేర్కొన్నారు. గత 46 రోజులుగా జరుగుతున్న ఈ డ్రైవ్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రోజూ వారీ పనుల్లో వారు ఎదుర్కొన్న సవాళ్లు, అనుసరించిన వ్యూహాల్ని ఎండీ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో మంచి ప్రతిభ కనబర్చిన టాప్-10 సెక్షన్ల అధికారుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా గత రెండు నెలల్లో ఎంసీసీకి వచ్చిన ఫిర్యాదుల్ని ఈడీ మయాంక్ మిట్టల్ ఈ సమీక్షలో వివరించారు. స్పెషల్ డ్రైవ్‌లో చేపట్టిన పనులతో రోజూ వచ్చే సీవరేజీ ఫిర్యాదుల సంఖ్య తగ్గినట్లు ఈడీ గుర్తించారు. రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తితో పని చేస్తే.. డిసెంబర్ చివరి నాటికి రోజూ వచ్చే ఫిర్యాదుల్ని 30 శాతం తగ్గించి అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఈడీ అన్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తేయాలి

కుషాయిగూడ బస్‌డిపో వద్ద సీఐటీయూ ధర్నా

కుషాయిగూడ బస్‌డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కాప్రా, నవంబర్ 19: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కుషాయిగూడ ఆర్టీసీ బస్‌డిపో వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు, డిపో మేనేజర్ నుంచి పైస్థాయి అధికారి వరకు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పని గంటలు, పని వేళలు, పని భారాలు విపరీతంగా పెంచారని ఆరోపించారు. కచ్చితంగా ఓవర్ డ్యూటీలు చేయాలని, అర్ధరాత్రి వరకు డ్యూటీలు చేయాలని మహిళా కార్మికులను వేధిస్తున్నారని, అలా చేయని పక్షంలో సెలవులు ఇవ్వమని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కార్మికులపై వేధింపులు ఆపి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సందర్భంగా యూనియన్ కార్యకలాపాలకు అనుమతులు ఇస్తామని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పిందని, అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా, ఆ హామీలను నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.ప్రసాద్, కేవీ చారి, డీకే దుర్గయ్య, శివనారాయణ, షఫియా సుల్తానా, వెంకటేశ్, దేవిరెడ్డి, పోతురాజు, కృష్ణారెడ్డి, మన్మథరావు, డి.శ్రీనివాస్, సుధాకర్, రామాంజనేయులు, సాంబ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షుడు రాంబాబు యాదవ్

సుల్తాన్‌బజార్, నవంబర్ 19: ఎన్‌హెచ్ఎం పరిధిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు 2024-25 కంటి నేషన్, రెన్యువల్ తక్షణమే ఇచ్చి ఫిక్సేషన్ అమలు చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం కోఠిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగులకు శ్లాబ్ విధానం రద్దు చేసి క్యాడర్‌వైస్ బేసిక్ పే ప్రకారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం జీతంపై పది శాతం ఇంక్రిమెంట్‌ను ఐసీటీసీ, పోలీస్ హోంగార్డ్‌ల తరహాలో ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని రద్దు చేసి ప్రభుత్వం నేరుగా/ప్రభుత్వ కార్పొరేషన్ ద్వారా వేతనాలను చెల్లించాలని ఆయన కోరారు. లేని పక్షంలో అన్ని విభాగాల కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షపతి, రాష్ట్ర కోశాధికారి బి.సుభాష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ రఫీఉద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ శాంతికుమార్ గౌడ్‌లతోపాటు పెద్దెత్తున సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నార్మ్ డైరెక్టర్‌కు ప్లాటినం జూబ్లీ స్మారక పురస్కారం

న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న నార్మ్ డైరెక్టర్ డా.శ్రీనివాసరావు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 19: ఐకార్-నార్మ్ శాస్త్రవేత్తలకు మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన గ్లోబల్ సాయిల్స్ కాన్ఫరెన్స్‌లో(2024) సన్మానించారు. సాయిల్ సైన్స్‌కు విశేష కృషి చేసినందుకు గాను నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాసరావుకు ప్రతిష్టాత్మక ప్లాటినం జూబ్లీ స్మారక పురస్కారం లభించింది. అదేవిధంగా సాయిల్ సైన్స్ రంగంలో ప్రిన్సిపాల్ సైంటిస్టు డా. డి.దామోదర్ రెడ్డి చేసిన పరిశోధనా సహకాలను గుర్తించి, ఇండియన్ సొసైటీ ఆఫ్ సాయిల్ సైన్స్ యొక్క ఫెలోగా గుర్తించారు. వ్యవసాయం, రైతుల సంక్షేమశాఖ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నుంచి సన్మానాలు అందుకున్నారు. సాయిల్‌సైన్స్, సుస్థిర వ్యవసాయానికి వారు విశిష్ట సేవలందించినందుకు వారిని సత్కరించారు. ఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ సహకారంతో ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సాయిల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ సాయిల్‌సైన్స్ ఈ సదస్సును నిర్వహించిదన్నారు.

డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి

పంచాయతీరాజ్ సంస్థల రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42 శాతానికి పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావును కోరారు. మంగళవారం ఆయనను కలిసి పలు అంశాలపై చర్చించారు. అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించాలని, ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించాలని ఆర్. కృష్ణయ్య కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, గొరిగె మల్లేశ్, జల్లపల్లి అంజి, రామకృష్ణ, సతీశ్, రాంకోఠి, వీరన్న, అనంతయ్య, రాజేందర్, జయంతి, రాఘవేందర్, వంశీకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, నవంబర్ 19

మూడు నెలల్లో 30 చెరువులు పూర్తి కాలే..

- మరో రెండు నెలల్లో పూర్తి చేస్తామంటూ మళ్లీ గడువు
- 303 చెరువులకు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లతో తుది నోటిఫికేషన్ జారీ.. పెండింగ్‌లో మరో 2800 చెరువులు

సిటీబ్యూరో, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : మూడు నెలల్లో 30 చెరువులకు హద్దు రాళ్లను హెచ్ఎండీఏ పాతలేకపోయింది. ఓ వైపు ఆక్రమణల పేరిట నివాసితులు భయభ్రాంతులకు గురవుతుంటే.. హద్దుల నిర్ధారణ చేయడంలో జాప్యం చేస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలో చెరువులకు బఫర్, ఎఫ్టీఎల్ జోన్లను నిర్ధారిస్తూ... ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. కానీ మరోసారి గడువు కోరుతూ వచ్చే రెండు నెలల్లో పూర్తి చేస్తామంటూ కాలయాపన చేస్తోంది. హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల హద్దుల నిర్ధారణ ఓ డైలీ సీరియల్ తరహాలో సాగుతుండగా.. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 3500 చెరువులకు పూర్తి స్థాయి నోటిఫికేషన్ ఎప్పుడు పూర్తవుతుందని లేక్ ప్రొటెక్షన్ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

3 నెలల గడువులోగా హద్దులు తేల్చాలి..

హెచ్ఎండీఏ లేక్స్ విభాగం అలసత్వమో.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమో నగరంలో చెరువులకు శాపంగా మారింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. చెరువులకు పూర్వ వైభవం తీసుకువస్తామంటూ ప్రగల్భాలు పలుకుతూ చెరువుల ఆక్రమణల పేరిట పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను పంపింది. కానీ చెరువులకు ముందుగా హద్దులను తేల్చలేకపోతుంది. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 3500కు పైగా చెరువులలో 2700 చెరువులకు గత ప్రభుత్వమే ప్రిలిమినరీ నోటిఫికేషన్ చేసి హద్దులను తేల్చింది. ఇందులో కొన్నింటికి వేగంగానే బఫర్, ఎఫ్టీఎల్ హద్దులతో ఫైనల్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. అయితే ఈ సమయంలో చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఆక్రమణలకు తావులేకుండా చెరువుల బ్యూటిఫికేషన్, కాలుష్య రహిత చర్యలకు ప్రాధాన్యతనిస్తూ హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న పలు చెరువులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దింది. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ చేసిన చెరువుల అభివృద్ధిని తప్పుబట్టినట్లుగా.. హైడ్రాను ఏర్పాటు చేసి కూల్చివేతలకు దిగింది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలు తీవ్రంగా నష్టపోగా.. ప్రభుత్వం చేసిన అనాలోచిత నిర్ణయంపై జాతీయ స్థాయిలో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో అన్ని చెరువులకు హద్దులు నిర్ధారించాలని కొందరు పర్యావరణ, సామాజిక కార్యకర్తలు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ విచారించిన ఉన్నత న్యాయస్థానం మూడు నెలల గడువులోగా హద్దులు తేల్చాలని హెచ్ఎండీఏను ఆదేశించింది.

జనవరి చివరిలోపు సాధ్యమయ్యేనా?

ఆగస్టు నెలాఖరు నుంచి నవంబర్ వరకు హద్దుల నిర్ధారణపై నివేదిక ఇవ్వాల్సిన హెచ్ఎండీఏ మరోసారి గడువు కోరింది. జనవరి నెలాఖరులోగా హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న చెరువులకు హద్దులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. ఈక్రమంలో మూడు నెలల వ్యవధిలో కనీసం 30 చెరువులను పూర్తి చేయలేని అధికారులు.. జనవరి చివరిలోపు ప్రక్రియను ఎలా పూర్తి చేస్తారనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

పెద్ద చెరువు పెరిగింది..!

అమీన్‌పూర్‌లో హైడ్రా బృందం ఎఫ్‌టీఎల్ పెరిగిందంటూ స్థానికుల ఫిర్యాదు

అమీన్‌పూర్‌లో ప్లాట్ల ఓనర్లతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు పెరిగిందని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తూములు, అలుగులు రెండూ మూసివేయడంతో పాటు బండ్ ఎత్తు పెంచి అన్ని ఔట్‌లెట్స్ మూసివేయడంతో చెరువు విస్తీర్ణం ఐదురెట్లు పెరిగిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువు విస్తీర్ణం పెరగడంతో తమ ప్లాట్లన్నీ నీళ్లలో మునిగిపోతున్నాయని వాపోయారు. చెరువును కబ్జా చేయడం చూశాం.. కానీ చెరువే తమ భూములను కబ్జా చేస్తున్నదని వారు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు చెప్పారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు, కొత్త చెరువు, శంభుని కుంటను మంగళవారం హైడ్రా బృందం సందర్శించింది. చెరువులతో పాటు వెంకటరమణకాలనీ, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ, పద్మావావునగర్ సరిహద్దు ప్రాంతాలను స్థానికుల ఫిర్యాదుల మేరకు రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమీన్‌పూర్‌లోని పెద్ద చెరువు తూములు మూసివేయడంతో వాస్తవంగా 93.15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు ప్రస్తుతం 465 ఎకరాలకు విస్తరించిందని, దీంతో ఎఫ్‌టీఎల్ పరిధి పెరిగి తమ ప్లాట్లన్నీ నీటిలో మునిగిపోతున్నాయని స్థానికులు హైడ్రా కార్యాలయంలో గతంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం అమీన్‌పూర్‌లో పెద్ద చెరువు తూములు మూసేసిన ప్రాంతాలను, ఎగువ భాగంలో లేఅవుట్లు మునిగిన తీరును కమిషనర్ పరిశీలించగా చెరువు ఎగువ భాగంలో ఉన్న లేఅవుట్ల ఓనర్లు మ్యాపుల ద్వారా తమ సమస్యలను వివరించారు. అమీన్ పూర్ పెద్ద చెరువు అలుగులు, తూములు మూసేయడంతో ఎఫ్‌టీఎల్ పరిధి పెరిగి ఎగువన ఉన్న లేఅవుట్లు, నివాసాలు నీట మునిగాయని బాధితులు చెప్పారు. దీనిపై ప్రత్యేకమైన టెక్నికల్ బృందంతో సర్వే చేయిస్తామని, సర్వే రిపోర్ట్ ఆధారంగా మరో మూడునెలల్లో ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ రంగనాథ్ వారికి చెప్పారు. మరోవైపు వెంకటరమణకాలనీ, పద్మావతికాలనీ, హెచ్ఎంటి కాలనీల్లో పార్కులు కబ్జాలకు గురయ్యాయని, ఒకరి లేఔట్లలోకి మరొకరు చొరబడి పార్కులు, రహదారులు ఆక్రమించారంటూ స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ... సర్వే విభాగంతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో ఓ కమిటీ వేసి వారు ఇచ్చిన నివేదికను ప్రభుత్వానికి తెలియజేసి ప్రభుత్వ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. పద్మావతి లేఅవుట్‌లోకి చొరబడి తమ స్థలాలను కబ్జా చేశారంటూ కొంతమంది మాజీ ఎమ్మెల్యే కాటాపాని రాంభూపాల్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారని, లేఅవుట్‌లను పరిశీలించిన తర్వాత పార్కులు, రహదారులు ఆక్రమణకు గురైనట్లుగా తమ సర్వేలో తేలితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంకటరమణకాలనీ లేఅవుట్‌కు సంబంధించి ఒక ఎకరం ఆక్రమణకు గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టామని, గోల్డెన్ కీ వెంచర్ వాళ్లు వెంకటరమణకాలనీలోని పార్కును ఆక్రమించినట్లు వచ్చిన ఫిర్యాదుపై సర్వే జరిపించి విచారణ చేశామని తెలిపారు. శంభునికుంట ఎఫ్‌టీఎల్ పరిధిలోకి కొన్ని కట్టడాలు వచ్చాయంటూ తమకు ఫిర్యాదులొచ్చాయని, చెరువులకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు కూడా నడుస్తున్నాయని రంగనాథ్ చెప్పారు. చెరువుకు మధ్యలో రోడ్డు నిర్మించి చెరువును వేరు చేశారని, ఒకవైపు మట్టితో కప్పి ఆక్రమణలకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపడతామని రంగనాథ్ తెలిపారు.

విద్యతోనే ఏదైనా సాధించవచ్చు